## గ్రానైట్ పరిశ్రమతో వేలాది కుటుంబాలకు ఉపాధి

- ఐక్యతతో పరిశ్రమను కాపాడుకుందాం
- అధికారులు నోటీసులతో వేధించడం సరికాదు
- గ్రానైట్ మార్కర్స్ అసోసియేషన్ సమావేశంలో ఎంపీ వద్దిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం రూరల్/ రఘునాథపాలెం, డిసెంబర్ 29: గ్రానైట్ పరిశ్రమ.. వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తూ ఉపాధి కల్పిస్తోందని గాయత్రీ గ్రానైట్స్ అధినేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఖమ్మం బైపాస్‌రోడ్డులోని పీవీఆర్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన గ్రానైట్ ట్రేడర్స్, మార్కర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తెలంగాణలో అనేక జిల్లాల్లో విస్తరించిన ఉన్న ఈ గ్రానైట్ పరిశ్రమ ద్వారా ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తోందని అన్నారు. అలాగే, గ్రానైట్ పరిశ్రమను నమ్ముకొని నిర్వాహకులు, హమాలీలు, మార్కర్స్ సహా ఇతర అనేక పనులకు సంబంధించిన వ్యకులు ఉపాధి పొందుతున్నారని వివరించారు. అందుకని ఐక్యంగా ఉండి పరిశ్రమను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. నష్టాల ఊబిలో ఉన్న పరిశ్రమను కాపాడుకునేందుకు ప్రభుత్వం కచ్చితంగా చేయూతనివ్వాలని అన్నారు. స్లాబ్ ప్రకారంగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ కొంతమంది పోలీసులు, మైనింగ్ అధికారులు గ్రానైట్ రంగంలోని వారిని దొంగలను చూసినట్లు చూడడం సరికాదని అన్నారు. లీజుకు తీసుకున్న ప్రాంతంలోనే క్వారీలు నడుపుతున్నప్పటికీ ఇటీవల కొందరు అధికారులు క్వారీ యజమానులను ఇబ్బంది పెట్టేలా ఈటీసీ నోటీసులు ఇస్తున్నారని అన్నారు. ఆ నోటీసులను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత గ్రానైట్ మార్కర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను, డైరీని ఆవిష్కరించారు. అసోసియేషన్ బాధ్యులు తమ్మినేని సాగర్, రియాజ్, నరేందర్, వెంపటి ఉపేందర్, జానీ, నవీన్‌కుమార్, రహీం, శేషగిరి, శంకరాచారి, నూనావత్ కిషన్, బూర్ల కృష్ణ, శేఖర్, నర్సింహారావు, శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, ప్రసాద్, శ్రీకాంత్, రామ్మూర్తి, హనుమంతరావు, సైదులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మూాత బడులు

## సర్కారు పాఠశాలలు వెలవెల

- ఖమ్మం జిల్లాలో ఒక్క విద్యార్థి కూడా లేని ఎంపీపీఎస్‌లు 64
- హైస్కూళ్ల చరిత్రల్లో తొలిసారిగా మూతబడ్డ అష్ణగుర్తి పాఠశాల..
- మూసివేసిన పాఠశాలల టీచర్లు ఇతర స్కూళ్లకు సర్దుబాటు
- పంతుళ్లలో చిత్తశుద్ధి లోపం.. తూతూమంత్రంగా 'బడిబాట'
- విద్యాసంవత్సరం ఆరంభంలో వేలమందిని చేర్పించినట్లు లెక్కలు..
- తరువాత దశల్లో అందుకు భిన్నంగా క్షేత్రస్థాయి పరిస్థితులు..





పిల్లలు లేక మూసివేతకు సిద్ధమైన తిరుమలాయపాలెం మండలంలోని అజ్మీరతండా ప్రాథమిక పాఠశాల

ఖమ్మం, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): విద్యార్థులతో కళకళలాడాల్సిన సర్కారు బడులు వెలవెలబోతున్నాయి. విద్యార్థులు లేక పాఠశాలలకు తాళాలు వేస్తున్న పరిస్థితి నెలకొన్నది. సర్కారు బడుల్లో నైపుణ్యం గల ఉపాధ్యాయులకు కొదవ లేదు. అయినా నాణ్యమైన విద్యను అందించలేని దుస్థితి. ఈ కారణంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యావిధానంలో మార్పు తెస్తామని కొత్తగా వచ్చిన ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో మాత్రం చతికిలపడుతోంది. కొన్ని పాఠశాలలకు పట్టుమని పదిమంది పిల్లలు కూడా రావట్లేదు. సర్కారు విద్య పురోగమించకపోగా.. తిరోగమనం వైపు పయనిస్తుండడం ఆందోళన కలిగించే అంశం.

### ప్రమాద ఘంటికలు..

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పిల్లల్లేని పాఠశాలలకు మూసివేత ముప్పు పొంచి ఉంది. జిల్లాలో ఇప్పటికే ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలలను 64గా గుర్తించారు. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేసి ఆయా పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం చేశారు. జిల్లాలో వివిధ మండలాల్లో 64 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేరు. అదే విధంగా మరో 50కిపైగా ప్రాథమిక పాఠశాలల్లో కేవలం పది మందిలోపు మాత్రమే పిల్లలు ఉన్నారు. వీటిల్లో కొన్ని పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. దీన్ని బట్టి జిల్లాలో ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని పాఠశాలల పరిధిలోని ఆవాస ప్రాంతాల్లో బడిఈడు పిల్లలు లేరు. పాఠశాలలు తెరిచిన వెంటనే బడిబాట కార్యక్రమం చేపడుతున్నప్పటికీ చిత్తశుద్ధి లోపించడంతో అది కూడా చతికిలపడుతుంది. 2024-25 విద్యాసంవత్సరం ఆరంభంలో బడిబాట నిర్వహించి వేలాది మందిని పాఠశాలల్లో చేర్పించామని అధికారులు లెక్కలు వివరించి మరీ చూపించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి.

### టీచర్ ఉన్నారు.. పిల్లలు లేరు..



తల్లాడ మండలం ముద్దునూరు ఎంపీపీఎస్‌లో పిల్లల కోసం వేచి చూస్తున్న ఉపాధ్యాయుడు

తల్లాడ మండలంలో వెంకటాపురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) ఉంది. కే.ఏడుకొండలు టీచర్ అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. జూన్‌లో ముగ్గురు విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కానీ అదే నెల చివరలో వారు ప్రైవేట్ స్కూల్లో జాయిన్ అయ్యారు. విద్యార్థులు లేకపోవడంతో కేశవాపురం ఎంపీపీఎస్‌కు ఓరల్ డిప్యూటేషన్ కేటాయించారు. అక్కడ ఐదుగురు విద్యార్థులున్నారు. రెగ్యులర్ బదిలీల్లో కేశవాపురం టీచర్‌ను కేటాయించడంతో డిప్యూటేషన్‌పై అతడిని ఎంపీపీఎస్ ముద్దునూరుకు నవంబర్ మొదటి వారంలో పంపించారు. అప్పటి వరకు యూపీఎస్ ముద్దునూరులో పిల్లలు లేరు. ఊర్లో అందరినీ కలిసి స్కూలుకు పిల్లలను పంపాలని అడిగితే మూడో తరగతి విద్యార్థిని ఒకరు ప్రవేశం పొందింది. నెల తర్వాత ఉన్న ఆ ఒక్క విద్యార్థినిని కూడా ఆమె కుటుంబీకులు ఇక్కడ మాన్పించి వేరే స్కూల్లో జాయిన్ చేశారు. ఇప్పుడు అక్కడ ప్రస్తుతం విద్యార్థులెవరూ లేరు. ఇప్పుడు ఆ స్కూల్లో విద్యార్థులు లేరు. ఒక్క ఉపాధ్యాయుడు ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 64 ప్రాథమిక పాఠశాలలు పిల్లలు లేకపోవడంతో ఇదే తరహాలో వెలవెలబోతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో కృషి చేసిన దాఖలాలు కనిపించడం లేదు.

### తొలిసారి ఉన్నత పాఠశాల మూసివేత..

పిల్లలు లేని కారణంగా మూతబడిన వాటిల్లో ఇప్పటి వరకూ ప్రాథమిక పాఠశాలలే ఉన్నాయి. కానీ ఇదే కారణంగా తొలిసారిగా ఓ ఉన్నత పాఠశాల కూడా మూతబడింది. అక్కడి ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. వైరా మండలం అష్ణగుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలది ఈ పరిస్థితి. పిల్లల్లేని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను పిల్లలున్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఇప్పటి వరకు పిల్లల్లేని పాఠశాలలకు కూడా ఉపాధ్యాయులను కేటాయించి వారి సేవలను పిల్లలున్న ఇతర పాఠశాలల్లో వినియోగించుకునేవారు. వేతనాలు మాత్రం పిల్లలు లేని పాఠశాలల నుంచే డ్రా చేసేవారు.

### జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు ఇవే..

ఈ విద్యాసంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్ల వివరాలు మండలాల వారీగా ఇలా ఉన్నాయి. వాటిల్లో ఏన్కూరు మండలంలో ఎంపీపీఎస్ రాజులపాలెం, కల్లూరు మండలంలో ఎంపీపీఎస్ పాయాపూర్, ఎంపీపీఎస్ విశ్వనాథపురం, ఎంపీయూపీఎస్ లక్ష్మీపురం, ఖమ్మం అర్బన్ మండలంలో ఎంపీపీఎస్ రుద్రంకోట, రఘునాథపాలెం మండలంలో ఎంపీపీఎస్ మల్లేపల్లి, తిరుమలాయపాలెం మండలంలో ఎంపీపీఎస్ అజ్మీరతండా, ఎంపీపీఎస్ జోగులపాడు, ఎంపీపీఎస్ నాయకన్‌తండా, వేంసూరు మండలంలో ఎంపీపీఎస్ తుంగవరి కాలనీ, ఎర్రుపాలెం మండలంలో ఎంపీపీఎస్ చొప్పకట్లపాలెం ఉన్నాయి.

### వచ్చే విద్యాసంవత్సరం పిల్లలు ఉండేలా చర్యలు..



జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి పిల్లలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సర్కారు స్కూళ్లలో చదివితే కలిగే ప్రయోజనాల గురించి వేసవి నుంచే పిల్లలకు వివరించి అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం విద్యార్థులు లేని స్కూళ్లలో టీచర్లు ఉంటే వారిని ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేసి సేవలు వినియోగిస్తున్నాం. –సోమశేఖరశర్మ, డీఈవో ఖమ్మం

- తాజాగా మిగిలిన ఆ ఇద్దరు ఉపాధ్యాయులూ రివర్షన్
- కానీ వారికి అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగ్!
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

## 'స్పెషల్ రివర్షన్' సంపూర్ణం





ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 29: స్పెషల్ రివర్షన్ ఎట్టకేలకు సంపూర్ణమైంది. నిబంధనలు అతిక్రమించి పదోన్నతులు పొందిన ఆరుగురిలో మిగిలిన ఇద్దరిని కూడా రివర్షన్ చేశారు. కానీ వారికి అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడం కొసమెరుపు. గత జూన్‌లో నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయ పదోన్నతుల్లో నిబంధనలను అతిక్రమించి ఆరుగురికి పదోన్నతి కల్పించిన విషయాన్ని వరుస కథనాలతో 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. 'రివర్షన్‌తో సరి..చర్యలేవి మరి?' అనే శీర్షికన శనివారం ప్రచురించిన కథనానికి స్పందించిన డీఈవో.. మిగిలిన ఇద్దరికి కూడా రివర్షన్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ ఎట్టకేలకు రివర్షన్ ఇచ్చి ఆ ఆరుగురిని ఎస్‌జీటీలుగా వెనక్కి పంపింది. ఎస్‌జీటీలుగా స్వచ్ఛందంగా వెనక్కి వెళ్తామని రాసివ్వాలంటూ నలుగురిని కోరగా వారు అంగీకరించడంతో వారు కోరిన ప్రదేశాలు కేటాయించారు. మిగతా ఇద్దరి విషయంలో తాత్సారం జరుగుతోంది. వారిపై చర్యలు తీసుకోకుండా వారం రోజులుగా డీఈవో తాత్సారం చేశారు. చివరకు డీఈవో ఆ ఇద్దరిపై ఈ నెల 28న రివర్షన్ వేటు వేశారు. అయినప్పటికీ వారికి అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం.

### రెండు వైపులా తప్పిదాలు?

స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు స్పెషల్ బీఈడీతోపాటు ఆర్‌సీఐ జారీ చేసిన సీఆర్‌ఆర్ తప్పనిసరిగా ఉండాలి. సీఆర్‌ఆర్ లేకపోయినప్పటికీ సీఆర్‌ఆర్ కోసం తాము అప్లై చేసుకున్నామని చెబుతూ దరఖాస్తు చేసుకోవడంతో జిల్లా విద్యాశాఖ కార్యాలయ వర్గాలు వారికి సహకరించి పదోన్నతి కల్పించాయి. దీని ప్రకారం ఈ పోస్టుకు సీఆర్‌ఆర్ ఉండాలనే విషయం ఆ అభ్యర్థులకు తెలిసినట్టే కదా అని విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది అంటున్నారు. అలాంటప్పుడు తమకు అర్హత లేకుండా ప్రమోషన్ పొందడానికి ఎలా దరఖాస్తు చేసుకున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇది తమను తప్పు దారి పట్టించడమేనని అంటున్నారు. మరో వైపు తాము దరఖాస్తు చేసుకుంటే సరిగ్గా పరిశీలించకుండా అసలు ప్రమోషన్ ఎందుకు ఇచ్చారని, ఇప్పుడు తమను ఎందుకు తీసేస్తున్నారని, దీనికి బాధ్యులైన డీఈవో కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు వాదిస్తున్నారు. ఈ మొత్తం విషయాన్ని గమనిస్తున్న ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు ఇరువురి వాదనా సబబేనని, ఇరువురి తప్పిదమూ ఉందని అన్నారు. అందువల్ల రెండు వైపులా బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందేనని అభిప్రాయపడుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం..

పదోన్నతుల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన విద్యాశాఖ సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. అర్హత లేని ఉపాధ్యాయులకు రివర్షన్ ఇచ్చాం. ఇతర ప్రాంతాల్లో పోస్టింగ్ కూడా కల్పించాం.

–సోమశేఖరశర్మ, ఖమ్మం డీఈవో

## సమరయోధుల ఫొటోలతో నిరసన

### ఖమ్మంలో 19వ రోజూ కొనసాగిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె



స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలతో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 29: తమ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఖమ్మం జిల్లా ఉద్యోగులు చేస్తున్న సమ్మె 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆదివారం నాటి ఆందోళనలో భాగంగా ఖమ్మం కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలతో వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎస్‌ఏ సంఘం నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పే స్కేల్ వెంటనే ప్రకటించి సమ్మె విరమింప చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం నాయకులు పాషా, వీరస్వామి, నిర్మల, విజయలక్ష్మి, అనిల్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రికి వచ్చే భక్తులు.. బొజ్జిగుప్ప, నారాయణపేటకు వెళ్లాలి

- గిరిజనుల స్టాళ్లు, ప్రదర్శనలపై అధికారులు ఏర్పాట్లు చేయాలి
- భక్తులకు ఇబ్బందుల్లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలి
- ముక్కోటి ఏర్పాట్ల పరిశీలనలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్

భద్రాచలం, డిసెంబరు 29: ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను తిలకించేందుకు భద్రాచలం వచ్చే భక్తులు, పర్యాటకులు బొజ్జిగుప్ప, నారాయణపేట ప్రాంతాలను కూడా సందర్శించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ కోరారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గిరిజన పర్యాటక ప్రాంతాలను కూడా సందర్శించేలా అధికారులు తగిన విధంగా ప్రచారం చేయాలని సూచించారు. అలాగే అక్కడికి వెళ్లేందుకు మార్గాలు కూడా భక్తులకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రాచలంలో ఆదివారం సాయంత్రం పర్యటించిన ఆయన.. ముక్కోటి ఏర్పాట్లను, ఐటీడీఏ గిరిజన మ్యూజియం వద్ద చేపడుతున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముక్కోటికి వచ్చే భక్తుల కోసం జనవరి 5లోపు అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేసి ఉంచాలని సూచించారు. గిరిజన పర్యాటక ప్రాంతాలైన బొజ్జిగుప్ప, నారాయణపేటతోపాటు భద్రాచలంలోని గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసే గుడారాల వద్దకు భక్తులు ఎక్కువగా వచ్చేలా తగిన ప్రచారం చేయాలని సూచించారు. అలాగే అటువైపు వెళ్లేందుకు మార్గాలను తెలిపేలా రూట్‌మ్యాపులు ఉంచాలన్నారు. అలాగే నది ఒడ్డున గుడారాలను ఆకర్షణీంగా ఏర్పాటు చేయాలని, అక్కడ మౌలిక వసతులు కల్పించాలని, గిరిజన ఉత్పత్తుల ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలకు స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఐటీడీఏ పీవో రాహుల్, ఆర్డీవో దామోదర్‌రావు, దేవస్థానం ఈఈ రవీందర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్యదర్శులపై పని 'భారం'

- గ్రామ పంచాయతీల్లో సర్వే పనులతో సతమతం
- ఇప్పటికే తీరికలేనంతగా రోజువారీ విధులు
- వెంటాడుతున్న ఖాళీలు.. ఆపై అదనపు బాధ్యతలు..
- పని ఒత్తిడితో ఆవేదన.. నిధుల రాకపై ఆందోళన..



ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది (ఫైల్)

అశ్వారావుపేట, డిసెంబర్ 29: గ్రామాలభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు పనిభారంతో సతమతమవుతున్నారు. రోజువారీ విధులతోపాటు ప్రభుత్వం అదనంగా ఇస్తున్న సర్వే పనులతో వారు పని ఒత్తిడితో ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు కాకపోవంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఖాళీలు వెంటాడుతుండగా.. ఆపై మరికొన్ని పంచాయతీల్లో అదనపు బాధ్యతలు స్వీకరించాల్సి రావడం మరింత పనిభారాన్ని పెంచుతోంది. వారి మాతృశాఖ విధులతోపాటు మరిన్ని విధులు నిర్వర్తించాల్సి రావడంతో పని ఒత్తిడి అమాంతంగా పెరుగుతోంది.

భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో మొత్తం 481 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో సుమారు 40 పంచాయతీలకు కార్యదర్శులు లేరు. 27 మంది ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరు అరకొర వేతనాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. అదనపు పని ఒత్తిడికి తోడు కార్యదర్శులు లేని పంచాయతీల బాధ్యతలను అదనంగా మోస్తున్నారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి పంచాయతీ కార్యదర్శులు ముందుండి పనిచేస్తున్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరు, పచ్చదనం పెంపు, వీధి లైట్ల ఏర్పాటు వంటి మౌలిక సుదపాయాలను ప్రజలకు అందిస్తున్నారు. ప్రజలతో నేరుగా సంబంధాలు ఉన్న కార్యదర్శులు స్థానిక సమస్యలను పరిష్కరించడంలో నిధులు విడుదల కాక చేతులు ఎత్తేస్తున్నారు. వారి వేతనాలు సర్దుబాటు అయ్యే వరకు సొంత ఖర్చులు వెచ్చిస్తున్నారు. పెద్ద సమస్యలు పరిష్కరించాలంటే బిక్క మొహాలు వేస్తున్నారు. ఇంత పనిభారంతో కొట్టుమిట్టాడుతున్న కార్యదర్శులకు ప్రభుత్వం ఇతర సర్వే విధులు కేటాయించి మరింత పని ఒత్తిడిని పెంచుతోంది. ఫలితంగా ఇంటి పన్నులు వసూళ్ల లాంటి పనులు మూలనపడుతున్నాయి.

### రోజు వారీ పనులతో బిజీబిజీ..

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం సహా రోజు వారీ పనులతో గ్రామ కార్యదర్శులు బిజీబిజీగా ఉంటున్నారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటిరు సరఫరా, వీధి లైట్ల ఏర్పాటు, నర్సరీల్లో మొక్కల పెంపకం, ఇంటి పన్నుల వసూళ్ల బాధ్యత పంచాయతీ కార్యదర్శులపైనే ఉంది. వీటిని సక్రమంగా నిర్వర్తించడానికే ఆపసోపాలు పడుతున్న కార్యదర్శులపై సర్వే పనులతో ప్రభుత్వం పనిభారం పెంచుతోంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో వీరి భాగస్వామ్యం ప్రధానంగా ఉంది. అలాగే పంచాయతీ ఓటర్ల జాబితా తయారీలోనూ వీరిదే కీలకపాత్ర. వీటికి తోడు తాజాగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కార్యదర్శుల నెత్తిన పెట్టింది. రోజూ చేసే పనులతో పనిభారం మోస్తున్న కార్యదర్శులకు సర్వే విధులు మరింత పని ఒత్తిడిని పెంచుతున్నాయి.

### వెంటాడుతున్న ఖాళీలు..

జిల్లాలోని 481 గ్రామ పంచాయితీల్లో సుమారు 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి బాధ్యతలను ప్రభుత్వం పొరుగు పంచాయతీల కార్యదర్శులకు అదనంగా అప్పగించింది. అలాగే 27 మంది ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. వీరి నెల వేతనం కేవలం రూ.15 వేలు మాత్రమే. రెగ్యులర్ కార్యదర్శులతో సమానంగా ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు పని చేస్తూ అరకొర వేతనాలతోపాటు పనిభారం మోస్తున్నారు. పైగా వీరికి ప్రభుత్వం సుమారు 6 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. ఫలితంగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే పని ఒత్తిడితో నలిగిపోతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడదల కాక, వేతనాలు సరిపోక అప్పులు తీసుకొచ్చి మరీ కొన్ని అభివృద్ధి పనులు చేస్తున్నారు.

### నిధులు అందక..

ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులు అందక కార్యదర్శులు అవస్థలు పడుతున్నారు. ఆర్థికపరమైన అంశాలతో కూడిన విధులను నిర్వహించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు అందించేవి. వాటితో కార్యదర్శులు ప్రజా సమస్యలు పరిష్కరించడంతోపాటు పలు అభివృద్ధి పనులు చేపడుతుండేవారు. సర్పంచ్‌ల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగియడంతో అప్పటి నుంచి పాలకవర్గాలు లేవు. దీంతో ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కావడం లేదు. దీంతో గ్రామ పంచాయతీలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. గడిచిన ఏడాది కాలంలో మే నెల నిధులు మాత్రమే పంచాయతీలకు అందాయి. గ్రామ పంచాయతీలకు ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు వస్తుంటాయి. ప్రస్తుతం ఈ నిధులు ప్రభుత్వాల నుంచి అందడం లేదు. జనరల్ ఫండ్ నుంచి నిధులు వినియోగిస్తున్నారు. ప్రతి నెలా ఇంటి పన్నులు వసూలు చేసి వాటి నుంచి సిబ్బందికి వేతనాలు ఇస్తున్నారు. మిగిలినవి ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. నిధులు లేని కారణంగా పంచాయతీల కార్యదర్శులు స్థానిక సమస్యలను పరిష్కరించడానికి అనేక తంటాలు పడుతున్నారు.

### ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తున్నాం..



గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి ఉండొచ్చు. కానీ మేము మాత్రం ప్రభుత్వ ఆదేశాల మేరకు మాత్రమే ఇతర సర్వే పనులను వారికి కేటాయిస్తున్నాం. పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడం వల్ల ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు ఆలస్యమవుతున్నాయి. అయినా ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

–ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, అశ్వారావుపేట


